Office Of The Advisor (communications)
Govt. Of Andhra Pradesh

# ‘రియల్‌టైమ్’తో వ్యవసాయానికి గుడ్‌టైమ్

## ఈ ఏడాది ఏపీలో 2 ముఖ్య సదస్సులు

## వ్యవసాయ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

అమరావతి జులై 11 : సూక్ష్మ సేద్యాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నామని, దానిపై రైతులలో నమ్మకం కలిగించగలిగామని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రస్తుతం 10 లక్షల హెక్టార్లలో సూక్ష్మ నీటి సేద్యం పద్ధతులు అవలంభిస్తున్నామని, ఇంకా 40 శాతం పెంపు కనిపించాలన్నదే లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. దీనిపై ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్న సంస్థలు వాణిజ్య ధోరణి వదిలి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసి ఫలితాలు సాధించాలని హితవు పలికారు. మంగళవారం సాయంత్రం ముఖ్యమంత్రి సచివాలయంలో రాష్ట్రంలో వ్యవసాయ పురోగతిని సమీక్షించారు. మహారాష్ట్రలో 20 లక్షల హెక్టార్లలో సూక్ష్మనీటి సేద్యం జరుగుతోందని, ఏటా 3 లక్షల హెక్టార్లు పెంచుకుంటూ వెళుతున్నారని, ఏపీలో ఆ స్థాయిలో పెరగాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

ఆరంభించిన 14 రోజులలో 2,41,158 హెక్టార్లలో ఇ–క్రాప్ జరిగిందని అధికారులు వివరించగా, లక్ష్యంలో 35 శాతం మాత్రమే పూర్తి కావడం పట్ల ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తంచేశారు. అనుకున్న లక్ష్యాన్ని నూరుశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. ఈనెల 26వ తేదీన నిర్వహించే బ్యాంకర్ల సమావేశం నాటికి ఇ–క్రాప్ బుకింగ్ లక్ష్యం పూర్తవ్వాలని స్పష్టంచేశారు. జియో ట్యాగింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయడానికి ఇంజనీరింగ్ విద్యార్థుల సహాయం తీసుకోవాలని ఇప్పటికే చెప్పానని గుర్తుచేశారు. రియల్‌టైమ్ గవర్నెన్స్‌లో ప్రతి ఇంజినీరింగ్ కళాశాలను వనరుల అభివృద్ధి కేంద్రంగా తీసుకున్నామని చెప్పారు. ఇంజనీరింగ్ కళాశాలల్లో ఒక తరగతి గదిని సంబంధిత శిక్షణా కార్యక్రమాలకు ఉపయోగించాలని చెప్పారు. చౌక ధరల దుకాణాల్లో ఇబ్బందులను ఇంజనీరింగ్ విద్యార్థుల ద్వారా పరిష్కరిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయంలో మరింత వృద్ధి సాధించేందుకు కృషిచేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యంగా రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా వ్యవసాయంలో మంచి ఫలితాలు సాధించగలుగుతున్నామని చెప్పారు.

అనంతపురము ప్రత్యేక దృష్టి పెట్టామని, ముగ్గురు సభ్యులతో ప్రత్యేక బృందాన్ని పంపించామని అధికారులు వివరించారు.

సూక్ష్మ పోషకాల అందజేత కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున చేపట్టాలని చెప్పారు. అవసరమైతే వెయ్యి కోట్లు కేటాయించేందుకైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సూక్ష్మపోషకాలతో భూమిని బలవర్ధకం చేశాక మేలైన విత్తనాలు అందిస్తేనే ఫలితం ఉంటుందన్నారు. వ్యవసాయంలో ఉత్పత్తి వ్యయం తగ్గి ఆదాయం పెరగాలన్నారు. జూన్ ఫస్టుకే సాగునీరు అందించడం వల్ల అక్టోబరు, నవంబరు మాసాల్లో తుఫాను ముంపు ప్రభావం నుంచి తప్పించుకోగలిగామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విషయంలో రైతాంగంలో సంతృప్తి వ్యక్తం అవుతోందన్నారు. 60శాతం నర్సరీ ప్లాంటేషన్ పూర్తి చేసినట్టు తెలిపారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ద్వారా రైతుల్లో అవగాహన పెంచాలని సీయం వారికి సూచించారు. సకాలంలో స్పందించడం, పర్యవేక్షణ చేయడం, అవగాహన పెంచడం, సమర్ధంగా అమలు చేయడం ద్వారా వ్యవసాయంలో అద్భుత ఫలితాలు సాధించగలమని ముఖ్యమంత్రి అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు అవసరమైనన్ని నిధులు కేటాయించామన్నారు. వర్షాభావం కనిపించిన చోటల్లా రెయిన్‌గన్స్ వినియోగంతో అధిగమించేందుకు సన్నద్ధంగా ఉండాలన్నారు. కరవును అధిగమించే చర్యలు సకాలంలో తీసుకోవడం ద్వారా వ్యవసాయంలో తప్పకుండా రాబడి పెంచవచ్చునన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటి చేయడమే లక్ష్యంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. సాయిల్ హెల్త్ కార్డులు పూర్తిస్థాయిలో అందించామని, విత్తనాలు, ఎరువులు, పంటరుణాలు అందిస్తున్నామని, సూక్ష్మపోషకాలు ఉచితంగా అందజేస్తున్నామని గుర్తుచేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ రూ.1,030 కోట్లు, వాతావరణ బీమా పరిహారం రూ.420 కోట్లు పంపిణీ చేశామని చెబుతూ, ఈ మొత్తాన్ని ఈ ఖరీఫ్ సీజన్‌లో పంట పెట్టుబడులకు రైతులు ఉపయోగించుకునేలా చూడాలన్నారు. వ్యవసాయానికి కావాల్సిన వనరులన్నీ రైతులకు ముందే ఇస్తున్నందున ఈ ఏడాది అన్ని పంటలలో మంచి దిగుబడులు సాధించాలని ఆశిస్తున్నట్టు చెప్పారు. అనంతపురము, కడప, కర్నూలు, గుంటూరు జిల్లాలలో పత్తి సాగును నియంత్రించాలని సూచించారు. ఇప్పటివరకు 2.6 లక్షల హెక్టార్లలో పత్తి

వేశారని అధికారులు వివరించగా, దాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులను మళ్లించాలని ముఖ్యమంత్రి కోరారు. అందుకోసం ప్రకటించిన ప్యాకేజ్‌పై రైతులలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. అంతర్జాతీయంగా పత్తి ధర తగ్గవచ్చునని అంచనా వేశారని తెలిపారు. వ్యవసాయ పంటల్లో, ఉద్యాన తోటల్లో ఉత్పాదకత గరిష్ట స్థాయికి చేరాలని అన్నారు. పండిన పంటలకు మార్కెట్ వసతులు పూర్తిస్థాయిలో కల్పిస్తున్నామని తెలిపారు. ఉత్తర కోస్తాంధ్ర ప్రాంతంలో ఐటీడీఏ ప్రాజెక్టు పరిధిలో వ్యవసాయ కార్యకలాపాలు పెంచుతున్నామని వ్యవసాయశాఖ కార్యదర్శి ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ చెప్పారు. సింగపూర్‌లో ఇటీవల జరిగిన వరల్డ్ అగ్రి ఫోరమ్‌లో ఏపీ వ్యవసాయరంగంలో తీసుకొచ్చిన పెనుమార్పులను ప్రస్తావిస్తూ అక్కడి మంత్రి అభినందించారని తెలిపారు.

## అక్టోబరులో ఐయోవాకు సీయం

అక్టోబరులో జరిగే వరల్డ్ ఫుడ్ ప్రైజ్ సింపోజియానికి హాజరుకావాలని ముఖ్యమంత్రికి నిర్వాహకులు కోరుతున్న విషయాన్ని సమావేశంలో అధికారులు ప్రస్తావించగా, దానికి హాజరయ్యేందుకు సీయం సుముఖత తెలిపారు. ఏపీలో 500 ఎకరాల స్థలంలో తలపెట్టిన మెగా సీడ్ పార్క్‌ను ఐయోవా రాష్ట్ర ప్రతినిధులు పరిశీలించి వెళ్లారని అధికారులు ఆయనకు చెప్పారు. ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఈసారి ‘ఇండియా రైస్ కాంక్లేవ్’ను ఏపీలో చేయాలని తలపెట్టినట్టు అధికారులు చెప్పగా, విజయవాడలో నిర్వహిద్దామని ముఖ్యమంత్రి అన్నారు. సెప్టెంబరులో వ్యవసాయరంగంలో ఐటీ, ఐవోటీ ప్రోత్సహించే కంపెనీలతో సెమినార్ నిర్వహించడానికి కృషి జరుగుతోందని వివరించారు. వచ్చే ఏడాది నాటికి రాష్ట్రంలో భూఉపరితలంపైనా, భూఉపరితలం అడుగున పుష్కలంగా నీరు ఉండే పరిస్థితి రావాలని, అందుకోసం ప్రాజెక్టులన్నీ ప్రాధాన్య క్రమంలో పూర్తిచేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతో మొబైల్ యాప్స్ ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తుండాలని అధికారులను కోరారు.